

పసుపుతో అమ్మవారికి అభిషేకార్చన



భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



మంగళగౌరి అలంకారంలో కనకమహాలక్ష్మి అమ్మవారు

అరండల్ పేట శ్రీఅష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి వారి దేవస్థానంలో శ్రావణ మాస కోటి కుంకుమార్చన మహోత్సవాలలో భాగంగా రెండో మంగళవారం శ్రీచక్ర మేరుకు విశేష అభిషేకార్చనలు జరిగాయి. అనంతరం ఆదిలక్ష్మి అమ్మవారికి 108 కిలోల పసుపుతో విశేష అభిషేకార్చన జరగ్గా, వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. విశేష హారతులు, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మర్రిపాటి ప్రసాద్, బృందం కార్యక్రమాలను పర్యవేక్షించారు. అదేవిధంగా శ్రావణ మంగళవారం సందర్భంగా సిద్ధార్థ నగర్ కనకమహాలక్ష్మి మందిరంలో అమ్మవారిని మంగళగౌరిగా అలంకరించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

క్లుప్తంగా

నేడు బాధ్యతలు స్వీకరించనున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పులి శ్రీనివాసులు నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో గుంటూరు నగర అదనపు కమిషనర్‌గా, గుంటూరు జిల్లా డ్వామా పీడీగా, గుంటూరు ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా(ఎఫ్ఏసీ), గుంటూరు జిల్లా డీఆర్‌ఓగా పనిచేశారు. ఇటీవల జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో గుంటూరు నగర కమిషనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడంతో నేడు ఉదయం 9.30 గంటలకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి



నగరంపాలెం: భారత రాజ్యాంగం, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి లీలావతి మాట్లాడుతూ విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా ఏదైనా తినుబండరాలు, శీతల పానీయాలు ఇస్తే తీసుకోవద్దని చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ప్యానల్ న్యాయవాది కట్టా కాళిదాస్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16న బాజీషాహిద్ దర్గాలో తలనీలాల వేలం

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా పెద్ద కాకానిలో వేంచేసి ఉన్న హజరత్ బాజీ షాహిద్ ఔలియా బాబా వారి దర్గాలో గత పది నెలలుగా నిలువ ఉన్న భక్తుల తలనీలాలకు వేలం వేయనున్నట్లు హజరత్ బాజీ షాహిద్ దర్గా కార్యనిర్వహణ అధికారి ముక్తార్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీన శుక్రవారం కాకాని బాజీ షాహీద్ ఔలియా వారి దర్గా ఆవరణలో గల కార్య నిర్వహణ అధికారి కార్యాలయం వద్ద వేలం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎక్కువ మొత్తంలో వేలంలో పాల్గొన్న వారికి రసీదు ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు.

నూతక్కి విద్యావతికి డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తెలుగు విభాగం పరిశోధకురాలు నూతక్కి విద్యావతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. తెలుగు పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య ఇ.మాధవి పర్యవేక్షణలో 'తాటికొల పద్మావతి సాహిత్యం– పరిశీలన' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు.

సమరయోధుల స్ఫూర్తిని కొనసాగించాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర సమర యోధుల స్ఫూర్తిని విద్యార్థులకు అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. మంగళవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో స్టెప్–స్వశక్తి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్ కళాశాల సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ కళాశాలల నుంచి తరలిచ్చిన 480 మంది విద్యార్థులు క్విజ్, వక్తృత్వం, దేశభక్తి గీతాలు, బృందనాట్యం పోటీల్లో పోటీపడ్డారు. ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించిన లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ నాయకుల స్ఫూర్తిని విద్యార్థులకు పెంపొందించేందుకు నిర్వహిస్తున్న పోటీలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించడంలో ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం విజేతలకు విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి సీహెచ్ రామకృష్ణమూర్తి, స్టెప్ అధికారి రాధిక, కళాశాల పూర్వ విద్యార్థి పి.అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, ఐక్యూసీ సమన్వయకర్త డాక్టర్ పి.వేణుగోపాల్, డైరెక్టర్ డాక్టర్ కె.కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌ఐ భయాలకు ఇక చెక్!

- ఇక నిల్చొనే ఎంఆర్‌ఐ తీయించుకోవచ్చు
- సంగీతం వింటూ ఎంఆర్‌ఐ తీయించుకునే సౌలభ్యం
- స్టాండింగ్ ఎంఆర్‌ఐతో వెన్ను సమస్యలకు చెక్ పెట్టొచ్చు
- చిన్న పిల్లలు, వృద్ధులకు స్టాండింగ్ ఎంఆర్‌ఐతో బహుళ ప్రయోజనాలు



స్టాండింగ్ ఎంఆర్‌ఐ

గుంటూరు మెడికల్: వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో ఎంతో కీలకంగా ఉండే ఎంఆర్‌ఐ (మ్యాగ్నటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్) పరీక్ష చేయించుకోవడానికి అనేకమంది భయపడతారు. ఎందుకంటే ఎంఆర్‌ఐ పరీక్ష చేసే గదిలో రోగి ఒక్కరినే ఉంచుతారు. అంతకంటే ముందు ఎంఆర్‌ఐ చేసే సమయంలో ఎక్కువ శబ్దాలు విడుదలవుతాయి. తద్వారా అనేక మంది రోగులు ఎమ్మారై పరీక్ష చేయించుకునేందుకు భయపడుతుంటారు. కానీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం ద్వారా ఎలాంటి భయాలు లేకుండా ఎంఆర్‌ఐ పరీక్ష చేయించుకునేందుకు మార్గం సుగమమైంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులకు ఎంఆర్‌ఐ స్కాన్ చేయాలంటే వైద్యులు, వైద్య సిబ్బందికి తల ప్రాణం తోక్కొస్తుంది. ఒకేచోట కదలకుండా ఎక్కువ సమయం పరీక్ష కోసం వేచి ఉండలేక, అనేక భయాలు, రోగులను వెంటాడటం ద్వారా ఎంఆర్‌ఐ పరీక్షకు వెనుకడుగు వేస్తున్నారు.

స్టాండింగ్ ఎంఆర్‌ఐతో ఎంచక్కా..

ఎంఆర్‌ఐ పరీక్ష చేయించుకోవాలంటే రోగి బల్లపై పడుకొని సొరంగం లాంటి ప్రదేశంలోకి తలను పంపించి చేస్తారు. ఈ విధానంలో రోగికి చాలా భయాలు కలుగుతాయి. ఒక వేళ పరీక్ష సమయంలో రోగి కదిలితే రిపోర్టు సక్రమంగా రాదు. మళ్లీ పరీక్ష చేయాల్సి వస్తుంది. భయాలు లేకుండా రోగులు కూర్చున్నా, నిలబడినా ఇతర భంగిమల్లో ఎంఆర్‌ఐ పరీక్ష చేసేలా స్టాండింగ్ ఎంఆర్‌ఐ అందుబాటులోకి వచ్చింది. మనదేశంలో ఢిల్లీలో మాత్రమే ఈ ఆధునిక ఎంఆర్‌ఐ పరికరం అందుబాటులో ఉండగా, ఏడాది క్రితం గుంటూరులో కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంఆర్‌ఐ పరీక్ష చేయించుకునే సమయంలో రోగి చక్కగా సంగీతం వింటూ ఎలాంటి భయానికి లోనుకాకుండా కూర్చుని ఇతర భంగిమల్లో పరీక్ష చేయించుకోవచ్చు. జాయింట్స్, స్పైన్ సమస్యలకు స్టాండింగ్ ఎంఆర్‌ఐ ద్వారా పూర్తిగా చెక్ పెట్టొచ్చు. గతంలో పడుకొని స్కానింగ్ చేయించుకోవడం ద్వారా వెన్ను సమస్యలు, మెడ, భుజాలు, ఇతర కీళ్లవద్ద సమస్యలు అంతగా గుర్తించే అవకాశం లేదు. నేడు వివిధ రకాల భంగిమల్లో కూర్చొని పరీక్ష చేయించుకోడం ద్వారా పూర్తిగా వ్యాధి నిర్ధారణ చేసి రోగికి సత్వర చికిత్స అందించి వ్యాధి నుంచి విముక్తి కలిగిస్తున్నారు.

అంతర్జాతీయ గుర్తింపు



స్పైన్ సర్జన్ దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిసారిగా, దేశంలో రెండోదిగా స్టాండింగ్ ఎంఆర్‌ఐను గుంటూరులో అందుబాటులోకి తీసుకొచ్చాం. దీని ద్వారా జాయింట్స్, స్పైన్ సమస్యలను చాలా సులువుగా, త్వరితగతిన గుర్తించి చికిత్స అందిస్తున్నాం. స్టాండింగ్ ఎంఆర్‌ఐతో వెన్ను సమస్యలను గుర్తించే విధానం గురించి పేపర్ ప్రజంటేషన్ చేయడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గుంటూరుకు, మల్లిక స్పైన్ సెంటర్‌కు గుర్తింపు లభించింది. రోగులు, ఎవరి తోడు లేకుండా ఒక్కరే తమకు నచ్చిన సంగీతం వింటూ ఎంఆర్‌ఐ చేయించుకోవచ్చు. క్లాస్ట్రో ఫోబియాలు స్టాండింగ్ ఎంఆర్‌ఐ ద్వారా తొలగిపోతాయి. ఎలాంటి శబ్దాలు ఉండవు. హీలియం వాడుతారు కాబట్టి పర్యావరణానికి హాని లేకుండా ఉంటుంది. ఎలక్ట్రిసిటీ చాలా తక్కువ వినియోగం ఉంటుంది.

– డాక్టర్ జి.నరేష్‌బాబు,

ప్రజల మన్ననలు చూరగొన్న హరికృష్ణ



కమిషనర్ హరికృష్ణను సన్మానిస్తున్న మేయర్ కావటి, పక్కన డెప్యూటీ మేయర్లు

నెహ్రూనగర్: గుంటూరు నగర ఇన్‌చార్జి కమిషనర్‌గా అనతికాలంలోనే అందరి మన్ననలను హరికృష్ణ పొందారని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. నగర కమిషనర్ (ఎఫ్ఏసీ) గా రిలీవ్ అవుతున్న ఎస్.హరికృష్ణ అభినందన సభ మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగర ఇన్‌చార్జ్ కమిషనర్‌గా 14 రోజుల అనతి కాలంలోనే ఎస్.హరికృష్ణ నగర ప్రజల, అధికారుల మన్ననలను పొందారన్నారు. నగర ప్రజల సమస్యలను తమ దృష్టికి తెచ్చిన వెంటనే వాటిని పాజిటివ్ ఆలోచనతో పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. పెండింగ్ లో ఉన్న అనేక ఫైల్స్ ని అతి తక్కువ కాలంలో పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ జీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన తక్కువ కాలంలోనే గుంటూరు నగరంలో పలు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. డెప్యూటీ మేయర్ షేక్ సజీలా మాట్లాడారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులు కమిషనర్ హరికృష్ణని పూల బొకేలు, శాలువాలు అందించి అభినందించారు. డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ శ్యాం సుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్‌ఓ మధుసూదన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సౌరవిద్యుత్ వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

నెహ్రూనగర్: సౌర విద్యుత్ వినియోగం ద్వారా పర్యావరణహితంతో పాటు, ఖర్చులు కూడా తగ్గించుకొని ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని గుంటూరు నగర కమిషనర్(ఎఫ్ఏసి) ఎస్.హరికృష్ణ తెలిపారు. మంగళవారం సంగం జాగర్లమూడి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌పై ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను నగరపాలక సంస్థ ఈఈ కొండారెడ్డి, డీఈఈ శ్రీధర్‌లతో కలిసి కమిషనర్ పరిశీలించారు. తొలుత ప్లాంట్ విస్తీర్ణం, విద్యుత్ ఉత్పత్తి, వినియోగం తదితర వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న జూపూడి రంగరాజు, బైక్‌పై ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, వనమా

గుంటూరు మెడికల్: బీజేపీ యువమోర్చా గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక గుంటూరు హిందూ కాలేజ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహాన్ని శుభ్రం చేసి పూలమాల వేసి అక్కడ నుంచి ర్యాలీ ప్రారంభించారు. యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ యశ్వంత్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ యాత్రలో భాగంగా సమాజంలో జాతీయ భావాల్ని పెంపొందించే దిశగా మంగళవారం జాతీయ జండాలతో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని బీజేపీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పైన జాతీయ జెండాలను ఎగర వేయాలన్నారు. ర్యాలీ గుంటూరు నగర పురవీధుల్లో కొనసాగించారు. ర్యాలీలో జోనల్ ఇన్‌చార్జ్ ముని సుబ్రహ్మణ్యం, జిల్లా హర్ ఘర్ తిరంగా కన్వీనర్ చరక కుమార్ గౌడ్, కో – కన్వీనర్స్ ఆవుల రాము, ఏలూరి లక్ష్మి, బీజేవైఎం నాయకులు బాల కోటయ్య, ఈశ్వర్, రాజా సాయి, బీజేపీ నాయకులు ఈదర శ్రీనివాసరెడ్డి, చెరుకూరి తిరుపతిరావు, పాలపాటి రవికుమార్, గంగాధర్, పద్మనాభం, దుర్గ భవాని, నాగమల్లేశ్వరి, జంధ్యాల రామలింగ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

- గుంటూరు నగరంలోని కొత్తపేటలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ బీజేపీ 6వ మండలం అధ్యక్షుడు సురేష్ కుమార్ జైన్ ఆధ్వర్యంలో కొత్తపేట చిన్న ఆంజనేయస్వామి గుడి నుంచి బోస్ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ ఈస్ట్ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో దేవి శెట్టి బాబురావు, తల్లం మనోజ్ కుమార్, వేమూరి అనిల్ కుమార్, మెడికల్ రిప్రజెంటేటివ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గుంటూరు డీ–9 సెక్షన్ పరిధిలోని ఆటోనగర్, నెహ్రూనగర్, బొంగరాలబీడు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాస బాబు మంగళవారం తెలిపారు. తనిఖీల్లో 53 మంది అధికారులు, 160 మంది సిబ్బంది, 60 బృందాలుగా ఏర్పడి 4537 సర్వీసులను తనిఖీలు చేశామన్నారు. అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరీల్లో విద్యుత్ వాడుతున్న ఇరువురిపై రూ.10వేలు జరిమానా విధించామన్నారు. అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 213 మందికి రూ. 11.80 లక్షలు అపరాధ రుసుము విధించామన్నారు. ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ అధికారుల తనిఖీల్లో మీటరుకు సీల్ లేకపోవడం, ఉద్దేశపూర్వకంగా వాటిని తొలగించడం, గాట్లు పెట్టడం వంటి చర్యలకు పాల్పడితే విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసు నమోదు చేయడం జరుగుతోందన్నారు. భారత విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం పనిచేయని మీటరు నుంచి విద్యుత్ వాడుకున్నా, ఉండవలసిన మీటరు బదులు వేరే మీటరు పెట్టి సీలు లేకపోయినా, విద్యుత్ చౌర్యం నిర్ధారణ అయినట్లు భావించబడుతుందన్నారు. మొదటిసారి తప్పిదానికి కాంపౌండ్ పద్ధతిలో అపరాధ రుసుము చెల్లిస్తే కేసు నుంచి విడిచి పెట్టడం జరుగుతుందన్నారు. రెండోసారి తప్పిదానికి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరుగుతోందన్నారు. అపరాధ రుసుము కట్టలేని పరిస్థితుల్లో రెవెన్యూ రికవరీ చట్టం ఉపయోగించి ఆస్తులు జప్తు చేయడం జరుగుతోందన్నారు. మొదటిసారి తప్పిదానికి మూడురెట్లు, రెండోసారి తప్పిదానికి ఆరు రెట్లు, అపరాధ రుసుము విధిస్తారని చెప్పారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం ఫిర్యాదుల కోసం 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు నేరుగా, వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీల్లో డెప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు ఎ.రవికుమార్, కె.రవికుమార్, పి.హెచ్.ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఎం.రవి కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూక్ రైడర్స్ చిన్నారులకు చెస్‌లో బహుమతులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): తమ రుక్ రైడర్స్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు రాష్ట్ర స్థాయి బహుమతులు సాధించారని కోచ్ ఎల్.రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అండర్–11 బాలికల విభాగంలో ఎ.ఆనంది ప్రథమ స్థానం, అండర్–13 బాలికల్లో ఎం.మనస్వి తృతీయ స్థానం, అండర్–7 బాలురలో గగన్ 5వ స్థానం, అండర్–9లో ఎం.చేతన్, వి.నోమిత్‌లు ప్రోత్సాహక బహుమతులు సాధించారని చెప్పారు.

యూనియన్ బ్యాంక్‌లో పొదుపు ఖాతాలపై అత్యధిక వడ్డీరేటు



కొరిటిపాడు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తపేట బ్రాంచ్‌లో సంవృద్ధి పథకంలో రూ. కోటి విలువ గల ఖాతాలను మంగళవారం తెరిచారు. ఈపథకంలో ఖాతాదారులు 333 రోజులు బ్యాంకులో పొదుపు చేస్తే వారికి అత్యధిక వడ్డీ రేటు బ్యాంకు అందిస్తుంది. ఈసందర్భంగా బ్యాంకు రీజనల్ హెడ్ సయ్యద్ జవహర్ మాట్లాడుతూ స్థూల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వడ్డీ రేటు భవిష్యత్తులో తగ్గడానికి అవకాశం లేకపోలేదన్నారు. పొదుపు దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 333 రోజుల స్కీమ్‌లో పొదుపు చేసి లబ్ధి పొందాలని కోరారు. సీనియర్ సిటిజన్స్‌కు 8.15 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పొదుపు దారులకు డిపాజిట్ పత్రాలు అందజేశారు.

మహిళా కళాశాలలో హ్యాండ్లూమ్ వాక్



హ్యాండ్లూమ్ వాక్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులతో ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ చేనేత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం హ్యాండ్లూమ్ వాక్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు బొల్లాప్రగడ శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చేనేతను ప్రోత్సహించేందుకు స్త్రీ సాధికారత విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ప్రతి శనివారం చేనేత వస్త్రధారణ, ఏడాదికి ఒకసారి చేనేత వస్త్రప్రదర్శన, అమ్మకాలు నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లు బాగున్నాయని అన్నారు. ఈసందర్భంగా అధ్యాపకులు, విద్యార్థినులు చేనేత వస్త్రాలను ధరించి హ్యాండ్లూమ్ వాక్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్త్రీ సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ పి.విజయలక్ష్మి, డాక్టర్ భవానీ, అనితా సూజన్, ప్రసన్న పాల్గొన్నారు.

పర్యావరణ మార్పులతో అంతరిస్తున్న జీవజాతులు

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో 'జీవ వైవిధ్య సంరక్షణలో యువతపాత్ర' అనే అంశంపై ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతిలో వస్తున్న మార్పులను తట్టుకోలేక, ఎన్నో జీవజాతులు అంతరించిపోతున్నాయని, దీనికి ప్రధాన కారకుడు మనిషే అని అన్నారు. మనిషి అనుసరిస్తున్న ప్రకృతి ప్రతికూల చేష్టల కారణంగా ఏటా కొన్ని వందలజాతులు అంతరించి పోతున్నాయని చెప్పారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రసంశాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం సిద్దిక్, ఉపాధ్యాయులు శివశంకర్, అప్పారావు, శాంతి ప్రియ, మల్లికార్జునరావు, బాబురావు, గంగాధర్, ధనయ్య, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

వ్యాసరచన పోటీల్లో లిఖిత (జెడ్పీ హైస్కూల్, అంకిరెడ్డిపాలెం), తులసి (నారాకోడూరు హైస్కూల్), రిషిత (జెడ్పీ హైస్కూల్, కంతేరు) చిత్రలేఖనంలో ఆఫ్తాబ్ అలీ (మున్సిపల్ హైస్కూల్, వేణుగోపాల్ నగర్), హఫీజ్ (కాసు శాయమ్మ జీఎంసీ హైస్కూల్), షాలిని (శారదానికేతన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంటూరు),

వక్తృత్వంలో భూమిక (జెడ్పీ హైస్కూల్, అబ్బినేనిగుంటపాలెం), కావ్య (పెదపాలెం జెడ్పీ హైస్కూల్), సమీరా, నల్లపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వరుసగా తొలి మూడుస్థానాల్లో విజేతలుగా నిలిచారు.

శారదాకాలనీ ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందించిన కోటా మాల్యాద్రి

లక్ష్మీపురం: తూర్పు నియోజకవర్గ పరిధిలోని శారదాకాలనీ వాసుల నివాస గృహాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి అన్నారు. స్థానిక తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌ను మంగళవారం కోటా మాల్యాద్రి ఆధ్వర్యంలో శారదాకాలనీ వాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారదాకాలనీలో వసతులను కల్పించి, వారి నివాస గృహాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ స్పందిస్తూ శారదా కాలనీ వాసుల నివాస గృహాలకు రిజిస్ట్రేషన్‌తో పాటు అక్కడి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానికులు ఎం.లక్ష్మయ్య, కె.సుబ్బయ్య, సిహెచ్ వెంకటేశ్వర్లు, జి.మాల్యాద్రి, సిహెచ్.విజయ్ కుమార్, దుర్గయ్య, ఈశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, తిరుమలరెడ్డి, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు

సంక్షిప్త వార్తలు

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పట్నంబజారు: భర్త మందలించాడని భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేవీపీ కాలనీలో నివాసం ఉండే అల్లం సాంబశివరావు, ఉదయ లక్ష్మిలకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఉదయలక్ష్మి నిత్యం ఫోన్లు అధికంగా మాట్లాడుతోందని భర్త మందలించాడు. ఈక్రమంలో ఈనెల 2వ తేదీన ఉదయలక్ష్మి ఇంట్లో ఎవరితో చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో మంగళవారం భర్త సాంబశివరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

పట్నంబజారు: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే మారంపూడి బోడయ్య (71) మంగళవారం పలు పనుల నిమిత్తం బ్రహ్మనందరెడ్డి స్టేడియం సమీపంలో వెళుతుండగా బాపట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఆసుపత్రికి తీసుకెళ్లే సరికి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమయపాలన పాటించాలి



నెహ్రూనగర్: మద్యం షాపులు సమయపాలన పాటించడంతో పాటు ప్రభుత్వం సూచించిన జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు అందుబాటులో ఉండేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం గుంటూరు నల్లపాడులోని ఐఎంఎల్ డిపో, మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డిపోలో ఇండెంట్ వ్యవస్థ పనితీరు, విధివిధానాలు, షాపుల నుంచి ఇండెంట్ ఏ విధంగా పెడతారు వంటి ఇతర విషయాలను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జిరావు, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మద్యం దుకాణాల్లో జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్స్ మద్యం అందుబాటులో ఉంచాలని, డిజిటల్ చెల్లింపులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.